ఓటెత్తిన ఉపాధ్యాయులు

■ ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు ■ అధికారుల పర్యవేక్షణ, పోలీసుల బందోబస్తు భేష్ ■ ఓటింగ్ శాతం మెరుగు


దుమ్ముగూడెం: పోలింగ్ కేంద్రం వద్ద సీఐ, ఎస్ఐ, సీఆర్పీఎఫ్ బలగాల బందోబస్తు

నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా జరిగింది. అధికారుల పకడ్బందీ చర్యలు, పోలీసులు, సీఆర్‌పీఫ్ బలగాల కట్టుదిట్టమైన భద్రత నేపథ్యంలో ఎలాంటి ఘర్షణలు జరగలేదు. ఆయా ప్రాంతాల్లోని అధికారులు పోలింగ్ సరళిని పరిశీలించారు. సాధారణ ఎన్నికల కన్నా పోలింగ్ శాతం ఎక్కువగానే నమోదైనప్పటికీ.. వందశాతం అన్నిచోట్ల సాధ్యపడలేదు.


భద్రాచలంటౌన్: ఓటు హక్కు వినియోగించుకున్న ఉపాధ్యాయులు

భద్రాచలంటౌన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. మొత్తం 253 మంది ఓటు హక్కును వినియోగించాల్సి ఉండగా 244 మంది మాత్రమే ఓటు వేశారు. దీంతో 96.44 శాతం ఓటింగ్ శాతం నమోదైంది. పోలింగ్ జరుగుతున్న విధానాన్ని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ పరిశీలించారు.

దుమ్ముగూడెం: మండలంలోని దుమ్ముగూడెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా 61 మంది ఓటర్లకుగాను 59 మంది (97శాతం) తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రం దగ్గర సీఐ అశోక్ నేతృత్వంలో ఎస్ఐ వెంకటప్పయ్య బందోబస్తును ఏర్పాటు చేశారు.

దమ్మపేట: దమ్మపేటలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎన్నికలు చాలా మందకొడిగా కొనసాగాయి. మొత్తం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల సంఖ్య 76 కాగా 70 ఓట్లు పోల్ అయ్యాయి. 92.10 శాతం పోలింగ్ నమోదైంది.

ములకలపల్లి: ములకలపల్లిలో 85 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మొత్తం 26 మంది ఓటర్లుకు గాను, 22 మంది ఓట్లు వేశారు. వీరిలో 10 మంది మహిళలు, 12 మంది పురుషులు ఉన్నారు.

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటలోని పోలింగ్ స్టేషన్ నంబరు 80 పరిధిలో మొత్తం 47 ఓట్లు ఉండగా, 44 ఓట్లు నమోదయ్యాయి. 20 మంది పురుషులు, 24 మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.91.48 శాతంగా ఓటింగ్ నమోదైనట్లు స్థానిక తహసీల్దార్ వనం కృష్ణ ప్రసాద్ తెలిపారు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్స్‌లను ఆర్టీసీ బస్సులో పోలీసుల భద్రతతో స్ట్రాంగ్ రూంకు తరలించారు.

పినపాక: స్థానిక ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ నరేష్, ఎంపీడీఓ సునీల్, డీఎస్పీ వంగ రవీందర్ రెడ్డి పరిశీలించారు. మొత్తం మండలంలో 35 ఓట్లకు గాను 33 ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. వీరిలో 12 మంది మహిళలు, 21 మంది పురుషులు ఉన్నారు.

చండ్రుగొండ: అన్నపురెడ్డిపల్లిలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 20 ఓట్లకుగాను 19 ఓట్లు పోలింగ్ అయ్యాయి. తహసీల్దార్ జగదీశ్వర్‌ప్రసాద్ పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు.

మణుగూరుటౌన్: మండల వ్యాప్తంగా ఉపాధ్యాయుల ఓట్లు మొత్తం 122 ఓటర్లు ఉండగా, పురుషులు 54, స్త్రీలు 68 మంది ఉన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జెడ్పీహెచ్ఎస్‌లో 111 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఎస్ఐ ప్రసాద్ బందోబస్తు నిర్వహించారు.

బూర్గంపాడు: మండల కేంద్ర బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఉపాధ్యాయులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. మొత్తం 57 ఓట్లకు గాను 54 ఓట్లు పోలయ్యాయి.

చర్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మండలంలోని వివిధ హైస్కూళ్లకు చెందిన 51 మంది ఉపాధ్యాయ ఓటర్లకు గానూ 47 మంది ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 92 శాతంగా పోలింగ్ నమోదైంది.

100 శాతం ఓటింగ్ నమోదు..

ఆళ్లపల్లిలో..


గుండాల: ఆళ్లపల్లిలో పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సుతో అధికారులు

గుండాల: ఆళ్లపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 15 మంది ఓటర్లకు గానూ, 15 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 100 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తహసీల్దార్ శకుంతల తెలిపారు. గుండాల మండలంలో గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 13 మందికి గానూ, 10 మంది ఓటు వేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గుండాల సీఐ రవీందర్, ఎస్సై రాజమౌళి, ఆళ్లపల్లి ఎస్సై రతీష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. గుండాల, ఆళ్లపల్లి తహసీల్దార్ ఇమ్మానుయేల్, శకుంతల ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

చండ్రుగొండలో..

చండ్రుగొండ: మండలకేంద్రంలో మొత్తం 15 ఓట్లకుగాను15 ఓట్లు పోలైయ్యాయి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని సీఐ ఇంద్రసేనారెడ్డి పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఐ శివరామకృష్ణ పాల్గొన్నారు.

కరకగూడెంలో..

కరకగూడెం: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 19మంది ఓటర్లకు గాను 19 మంది ఓటు హక్కును వినియోగించుకొని 100శాతం పోలింగ్ నమోదు చేసినట్లు ప్రొసిడింగ్ ఆఫీసర్ శంకర్ తెలిపారు. వారిలో 10 మహిళా,09మంది పురుష ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు.

అశ్వాపురంలో..


అశ్వాపురం: పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తును పర్యవేక్షిస్తున్న మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి

అశ్వాపురం: అశ్వాపురం జెడ్పీ స్కూల్ పోలింగ్ కేంద్రంలో గురువారం పోలింగ్ నిర్వహించగా.. 37 మంది ఓటర్లకు గాను 37 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్‌ను తహసీల్దార్ స్వర్ణలత పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రం వద్ద సీఐ అశోక్‌రెడ్డి, ఎస్సై తిరుపతిరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి బందోబస్తు పర్యవేక్షించారు.


దమ్మపేట: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసిన ఉపాధ్యాయులు


అశ్వారావుపేటరూరల్: పోలింగ్ కేంద్రం వద్ద పోలీస్ సిబ్బంది పహారా


పినపాక: పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ ప్రక్రియకు సిద్ధంగా అధికారులు..


ములకలపల్లి: పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్న ఉపాధ్యాయుడు


మణుగూరుటౌన్: బందోబస్తు నడుమ బ్యాలెట్ బాక్సులను తరలిస్తున్న అధికారులు

క్లుప్తంగా

విజయనగరంలో 'నిక్షయ్ షివిర్'


క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నిశాంత్‌రావు

మణుగూరురూరల్: మండల పరిధిలోని విజయనగరం గ్రామంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం నిక్షయ్ షివిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ నిశాంత్ రావు క్షయవ్యాధిపై అవగాహన కల్పించి అనుమానితులను గుర్తించి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిశాంత్‌రావు మాట్లాడుతూ.. క్షయ వ్యాధిపై చర్చించుకుని దానిపై అవగాహన పెంచుకోవాలన్నారు.అనంతరం పల్లె దవాఖానాలో మొబైల్ వాహనంలోని డిజిటల్ ఎక్స్ రే ద్వారా అనుమానితులకు ఎక్స్‌రే, కళ్లే పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పరంగిని, అనసూర్య, వైద్య సిబ్బంది రాంప్రసాద్, కృష్ణ, రవి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం..

అశ్వాపురం: భూమి కోసం పోరాడుతున్న ఆదివాసీలకు సీపీఎం పక్షాన అండగా ఉంటామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని మనుబోతులగూడెంలో పోడు భూముల సాగుదారులతో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా ఆదివాసీలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలన్నారు. ఆదివాసీల సాగులో ఉన్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇస్తామని, త్రీ ఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించి సాగునీరు అందిస్తామని చెప్పిన మాటలు మరిచారని విమర్శించారు. మండలంలో వేములూరు బీట్‌లో ఆదివాసీల సాగులో ఉన్న భూములలో కొందరు అటవీ అధికారుల అత్యుత్సాహం వల్ల జిల్లా మొత్తం వలస ఆదివాసీల్లో ఆందోళన నెలకొందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యుడు గద్దల శ్రీనివాసరావు, నాయకులు మడివి రమేష్, పాయం నర్సింహారావు, సాంబశివ రావు, రమేష్, శమంతకమణి, విజయ పాల్గొన్నారు.

నేడు వైద్యశిబిరం

మణుగూరురూరల్: మండల పరిధిలోని పగిడేరు గ్రామపంచాయతీలో ఉన్న యూపీఎస్ పాఠశాలలో నేడు శుక్రవారం భద్రాచలం ఐటీడీఏ, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మణుగూరు పీహెచ్‌సీ డాక్టర్ నిశాంత్ రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వైద్యశిబిరంలో జనరల్ ఫిజియన్, గైనకాలజిస్ట్, పిడియాట్రిక్, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, ఆఫ్తాల్మాజీ, డెర్మటాలజీ వైద్యనిపుణులు సేవలు అందించనున్నట్లు తెలిపారు. అలాగే నిక్షయ్ షివిర్‌లో భాగంగా ఛాతి ఎక్స్‌రే సౌకర్యం కూడా కలదని తెలిపారు. పగిడేరు, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఆదివాసీ కుటుంబాలకు వితరణ


ఆదివాసీలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న సుధారాణి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని రమణక్కపేట గ్రామానికి చెందిన నిరుపేదలైన 20 ఆదివాసీ కుటుంబాలకు సత్తుపల్లికి చెందిన సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ కొనకళ్ల సుధారాణి బియ్యం, ఇతర నిత్యావసరాలతోపాటు చిన్నారులకు పల్లీ ఉండల ప్యాకెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులకు ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేకంగా అవగాహన సదస్సు నిర్వహించి వారికి అవగాహన కల్పించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి

మణుగూరుటౌన్: మండలంలోని తోగ్గూడెం పంచాయతీలోని మినీ మేడారంగా పిలవబడుతున్న సమ్మక్క–సారలమ్మ ఆలయ ప్రాంగణంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆయన నివాసంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ఊకే వీరయ్య మాట్లాడుతూ.. శాశ్వత లైట్లు, ట్రాన్స్‌ఫార్మర్ లేక జాతర వేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తరచూ ఆలయ పరిసరాల్లో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. దృష్టి సారించి ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు అయ్యేలా కృషి చేయాలని కోరగా.. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఆలయ కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

కల్యాణం.. కమనీయం


బూర్గంపాడు: మోతెగడ్డలో భద్రకాళి, వీరభద్రస్వామి కల్యాణం..

బూర్గంపాడు: శివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణోత్సవాలు అత్యంత వైభవంగా సాగాయి. మోతెగడ్డలో భద్రకాళి సమేత వీరభద్రస్వామి కల్యాణాన్ని వేలాదిమంది భక్తులు కనులారా దర్శించి తరించారు. మోతెగడ్డ కల్యాణానికి నాలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. భక్తజన సందోహంతో గోదావరి తీరం పులకించిపోయింది. నాగినేనిప్రోలు, మోరంపల్లిబంజర, బూర్గంపాడు, సారపాకలలోని శివాలయాల్లో శివపార్వతుల కల్యాణం అత్యంత రమణీయంగా కమనీయంగా సాగింది. ఈ సందర్భంగా భక్తులకు అన్నసమారాధనలు చేశారు.

వీరభద్రస్వామి కల్యాణం

చర్ల: మండలంలోని తేగడలో ఉన్న భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో గురువారం ఉదయం కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వీరశైవ జంగమ వంశీయుల నేతృత్వంలో నాలుగు దశాబ్దాలుగా ఇక్కడ కల్యాణం నిర్వహిస్తుండగా.. ఈ సారి కూడా బుధవారం తెల్లవారు జామునుంచి గురువారం తెల్లవారుజాము వరకు స్వామి వారికి అభిషేకం, ఊరేంపు, అలంకరణ, సుంకు కొలుచుట, నారసాల సంబురం, పాగోళ్ల సంబురం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. గురువారం ఉదయం 8.00 గంటలకు భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారికి సంప్రదాయబద్దంగా కల్యాణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఘనంగా ఊరేగింపు..

ములకలపల్లి: మండలకేంద్రంలోని ఉమా పృథ్వీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి పర్వదినం సందర్భంగా అత్యంత ఘనంగా శివపార్వతుల కల్యాణ ఘట్టాన్ని నిర్వహించిన విషయం విదితమే. స్థానిక పూజారి విస్సావజ్ఝల సురేశ్ శర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు నరాటి ప్రసాద్, పువ్వాల మంగపతి, బండి కొమరయ్య, సభ్యులు కొదుమూరి వీరగోపాల్, నరాటి రమేశ్ ఆధ్వర్యంలో పూజా క్రతువు నిర్వహించారు, కాగా గురువారం అత్యంత ఘనంగా పురవీధుల్లో ఊరేగింపు చేశారు. ఇళ్ల మంగిళ్లలో మహిళలు నీళ్లు వారబోసి, సదారంగా స్వాగతం పలికారు.

మార్చి 9న రవన్న వర్ధంతి సభ

భద్రాచలంటౌన్: ఖమ్మం పట్టణంలోని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ కార్యాలయంలో మార్చి 9న నిర్వహించనున్న రవన్న (రాయల సుభాష్ చంద్రబోస్) 9వ వర్ధంతి జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కె.రంగారెడ్డి కోరారు. ఈ మేరకు సభ పోస్టర్లను స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సభలో మేధావులు, పార్టీ నాయకులు పాల్గొని పలు అంశాలపై ప్రసంగిస్తారని తెలిపారు. మాస్‌లైన్ పంథాలు పురోగమించడానికి సభలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా నాయకురాలు కె.కల్పన, దాసరి సాయి, మునిగేలా శివ ప్రశాంత్, భాస్కర్ అన్న, భీమరాజు దేవా, ఉదయ, చుక్కయ, ముఖేష్, సుజాత, సరళ, మహేశ్వరి పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రంగారెడ్డి, తదితరులు

సాయి ఆలయంలో భక్తులకు అన్నదానం


అన్నదాత దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ బాధ్యులు

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లో ఉన్న షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా సాయినాథుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మణుగూరు పట్టణానికి చెందిన గంగవరపు వెంకటేశ్వర్లు –నిర్మల దంపతులు, వారి కుమారుడు అనురాగ్‌లు షిర్డీ సాయినాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాత గంగవరపు వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు. అనంతరం అన్నదాత వెంకటేశ్వర్లు దంపతులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

భద్రాచలంటౌన్: భద్రాచలం ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికులు తమ సమస్యలను తెలిపేందుకు నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్న డిపో మేనేజర్ తిరుపతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీపై సమస్యలను డిపో మేనేజర్‌కు తిరుపతికి దృష్టికి తీసుకురావాలనుకునే వారు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు 9959225960 నంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని ఆయన పేర్కొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన

భద్రాచలంటౌన్: రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య రోజు రోజుకి పెరుగుతున్న నేపథ్యంలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వినియోగం తప్పనిసరి అని భద్రాచలం మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య అన్నారు. కూనవరం రోడ్డులోని రవాణా శాఖ కార్యాలయం వద్ద గురువారం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాద సమయంలో తలకు హెల్మెట్ ఉండటం వల్ల ప్రాణాలు కాపాడుకోవడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

యువకుడికి ఆర్థిక సాయం

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెం కొత్తూరు గ్రామానికి చెందిన తెల్లం శ్రీకాంత్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ వాలీబాల్ విభాగం బెంగుళూరులో నేషనల్ కోచ్ కోర్సులో సీటు సాధించాడు. కోర్సు పూర్తి చేసేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతుండటంతో గురువారం డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య రూ.10వేలు, సీఐ అశోక్‌రెడ్డి రూ.5వేలు, కాంగ్రెస్ నాయకుడు ముత్తినేని వాసు రూ.2వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డుకు అస్వస్థత

మణుగూరుటౌన్: గతంలో అనారోగ్యంతో శస్త్రచికిత్సలు పొంది కాంట్రాక్ట్ సెక్యూరిటీగార్డుగా విధులు నిర్వహిస్తున్న వీరబాబు గురువారం విధులు నిర్వహిస్తూ అస్వస్థతకు గురయ్యాడు. తోటి కార్మికులు క్షతగాత్రుడిని ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. తన పైఅధికారి తనతో షెడ్‌కు వేసే పైపులు మోపించడం వల్ల తనకు శస్త్రచికిత్సలు జరిగిన పొట్టభాగంలో రక్తస్రావమైనట్లు పరామర్శకు వచ్చిన యూనియన్ ప్రతినిధులకు, ఏరియా అధికారులకు బాధితులు తెలిపాడు. కాగా మెరుగైన చికిత్సల నిమిత్తం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

స్పీడ్ బంప్‌ల పరిశీలన


స్పీడ్ బంపులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారే..

దమ్మపేట: మండలంలోని సుధాపల్లి ప్రధాన రహదారిపై వాహనాల వేగాన్ని నియంత్రించడానికి ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న స్పీడ్ బంప్స్‌ను గురువారం స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ అధికారులతో ఫోన్‌లైన్‌లో మాట్లాడుతూ.. గ్రామాల మధ్యన గల లింక్ రోడ్లపై కూడా స్పీడ్ బంప్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు.

మూల మలుపులు, దేవాలయాలు, పాఠశాలలు ఉన్న ప్రాంతాల్లో తప్పనిసరిగా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు.

గర్భిణులకు సీమంతం


సీమంత కార్యక్రమంలో పాల్గొన్న గర్భిణులు, తదితరులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఈశ్వరమ్మ గుట్ట అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాల కార్యక్రమాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఐటీసీ సంస్థ ఆధ్వర్యంలో మిషన్ సునేహ్ర కల్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు పోషకాహార విలువలను తెలియజేసి వారికి పలు కరకాల పండ్లు, గుడ్లు, పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను అందజేశారు. అనంతరం గర్భిణులను కుర్చోబెట్టి పండ్లు, సారె అందజేసి సీమంతం చేశారు. ఈ కార్యక్రమంలో మిషన్ సునేహ్ర కల్ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన శివరాత్రి ఉత్సవాలు


అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): అన్నపురెడ్డిపల్లిలో ఉన్న భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు గురువారం ముగిశాయి. ఈ నెల 25న ఉత్సవాలు ప్రారంభమవగా.. ఆలయ ప్రధాన పూజారి సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో చివరిరోజు పూర్ణాహుతి, ఆలయ బలిహరణ, ధ్వజ అవరోహణ, త్రిశూల స్నానం, నందివాహనసేవ శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పునఃనిర్మాణ ధర్మకర్త మారగాని శ్రీనివాసరావు, వనమా గాంధీ, మేనేజర్ పీవీ రమణ పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

ములకలపల్లి: బ్యాంక్ రుణాలను సకాలంలో చెల్లించాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) ములకలపల్లి శాఖ మేనేజర్ సతీష్ కోరారు. స్థానిక బ్యాంక్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట రుణాలకు సంబంధించి ఏడాది కాలంలోపు అయితే లక్షకు రూ.7 వేలు మాత్రమే వడ్డీ చెల్లించాలని, ఇందులో రూ.3 వేలు రిబేటు రూపంలో మరళా గుణగ్రహితకే వస్తుందని తెలిపారు. ఏడాది దాటితే 14 వేల వడ్డీతోపాటు, రిబేటు సౌకర్యం కోల్పోతారని వివరించారు. బ్యాంక్ పరిధిలో 240 డైరెక్ట్ క్రాప్ లోన్స్ మంజూరు చేశామని, వీటిలో 40 మంది మాత్రం రుణాలు నిర్ణీత గడువులో చెల్లించడంలేదన్నారు. ఇవేకాకుండా ముద్ర రుణాలు, గేదెల రుణాలు, స్వయం సహాయక సంఘాలకు రుణాలిచ్చినట్లు పేర్కొన్నారు. వార్షిక సంవత్సరం పూర్తవుతున్న నేపథ్యంలో మార్చి 15లోగా విధిగా రుణాలు చెల్లించి, బ్యాంక్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

కేంద్ర బడ్జెట్‌తో కార్పొరేట్‌కే ఊతం

చర్ల: కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు ఊతమిచ్చేదిలా ఉందని, అది కష్ట జీవులకు ఉపయోగపడేదేమీ కాదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కొలగాని బ్రహ్మాచారి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీఎస్ రామయ్య భవన్‌లో సీఐటీయూ మండల కన్వీనర్ పాయం రాధాకుమారి అధ్యతన జరిగిన సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం వరుసగా 8 సార్లు ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లలోనూ కార్పొరేట్ శక్తులకు మాత్రమే ప్రయోజనం కలిగించారని ఆయన విమర్శించారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి మచ్చా రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బందెల చంటి, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మాచారి